

5

రైతుల కోసం అనేక కార్యక్రమాలు


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..








సంపుటి - 2 సంచిక -312 శనివారం 14 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## బాధ్యతాయుతంగా

# మూసీ అభివృద్ధి

### మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

**20 టిఎంసిల గోదావరి జలాలు తరలిస్తాం**

**అద్భుత నగరాన్ని కాపాడుకునే బాధ్యత మనది**

**ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం**

**వరదలు వస్తే ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు**

**నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు**

**మూసీ ప్రాజెక్టును విమర్శిస్తున్న వారు అక్కడ ఉండగలరా?**




Telangana Chief Minister A Revanth Reddy giving PowerPoint presentation on Musi River Front project on March 13

**హైదరాబాద్,మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశారని, ఇప్పటికీ బృహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు**మిగతా 2లో...**

# కామాఖ్య-చర్లపల్లి

## అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

**అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు**

**శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోడీ**




**గువాహటి,మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):**
అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరార్ఝూర్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనీషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు.**మిగతా 2లో...**

## ఖాళీ సీట్ల కౌన్సెలింగ్‌కు

# అనుమతివ్వండి

**377 పీజీ మెడికల్ సీట్లపైహైకోర్టులో కాలేజీల పిటిషన్**

**సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడే వరకువేచిచూస్తాం: హైకోర్టు**



**హైదరాబాద్,మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో మిగిలిపోయిన పీజీ మెడికల్ సీట్ల కౌన్సెలింగ్‌కు అనుమతి ఇచ్చేలా ఆదేశించాలంటూ తెలంగాణ ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీల యాజమాన్యాల సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 377 పీజీ మెడికల్ సీట్లు **మిగతా 2లో...**

# పేదల ఇళ్లు కూలిస్తే సహించబోం

**మూసీ ప్రక్షాళలను ఎప్పడూ వ్యతిరేకించలే**

**ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం**

**మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం**

**మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి**

**పదేపదే బిజెపిని విమర్శించడం అపండి**

**తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు**



**హైదరాబాద్,మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):**
మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా**మిగతా 2లో...**

## నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

**ఏర్పాట్లు పూర్తి**

**సకాలంలో కేంద్రానికి చేరుకోవాలన్న అధికారులు**




**మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):**
శనివారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థి భవిష్యత్తుకు తొలి మెట్టుగా భావించే టెన్త్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమై ఏప్రిల్ 13 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగనున్న వార్షిక **మిగతా 2లో...**





## ఏపీలో రూ.47 కోట్ల విలువైన

# డ్రగ్స్ పట్టివేత

**ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో డ్రగ్స్ తయారీ కేంద్రంపై డీఆర్ఐ దాడులు**

**ఆపరేషన్ 'వైట్ హ్యామర్' పేరుతో రూ.47 కోట్ల అల్ప్రాజోలం స్వాధీనం**

**రసాయన పరిశ్రమ ముసుగులో అక్రమ దందా నిర్వహిస్తున్న వైనం**

**20 ఏళ్ల అనుభవమున్న కెమిస్ట్‌తో సహా ఇద్దరు సూత్రధారుల అరెస్ట్**

**హైదరాబాద్‌లో వేర్వేరుగా నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్**



## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై

# అభిశంసన

**పార్లమెంటు ఉభయసభల్లో తీర్మాన నోటీసు**

**ప్రవేశపెట్టిన ప్రతిపక్ష సభ్యులు -193 మంది ఎంపీల సంతకాలు**

న్యూఢిల్లీ **మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):**
దేశ ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయతను కోల్పోయినందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షం పార్లమెంటు ఉభయ సభలలో అభిశంసన నోటీసు ఇచ్చింది. శుక్రవారం తీర్మానం నోటీసును పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష పార్టీల సభ్యులు ప్రవేశపెట్టారు. తీర్మానం నోటీసుపై 193 మంది ఎంపీలు సంతకాలు చేశారు. వీరిలో 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఈ తీర్మానానికి సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఇచ్చిన నోటీసు లోక్‌సభ సెక్రెటేరియట్‌కు అందిందని, నోటీసు పరిశీలన ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని**మిగతా 2లో..**

# గ్యాస్ కొరత లేదు

## బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు

**అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు**

**జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి**

**గ్యాస్ కొరత పై జరుగుతున్న ప్రచారాన్ని సమర్ధవంతంగా తిప్పి కొట్టాలి**

**సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దు**

**గృహ ,ఆసుపత్రులకు,విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ ,ఆశ్రమాలకు ప్రాధాన్యత**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ**

**కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్**



# బాధ్యతాయుతంగా మూసీ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించామని చెప్పారు. నిజాంలు, బ్రిటీషర్లు సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏమైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం అని బిఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. మూసీ, ఈసీ సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నాం. మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేయత్నం చేస్తున్నాం. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులను పునరుద్ధరిస్తున్నాం. అందుకు ప్రజలు మాకు ఘన స్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు.. మూసీ పక్కన నివసిస్తారా? అలాంటి వాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్లే వరదలొస్తున్నాయి. మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్గొండ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. భవిష్యత్ తరాలకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వారి బాధల్ని కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్టుపై ముందుకు వెళ్తున్నాం. దీనికి అందరి సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు. గొప్ప నగరం హైదరాబాద్‌ను నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తమకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదని కుండబద్దలు కొట్టారు. మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల అధినేతలు, అగ్రనేతలకు సీఎం రేవంత్ సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా? అని ఆయా పార్టీల నేతలకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా చురకలంటించారు. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టుల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. పాలసీలు, వర్కింగ్ స్టైల్ మార్చుకున్నామని చెప్పారు. కొద్దిమంది ముఖ్యమంత్రులే ప్రజలకు గుర్తున్నారని పేర్కొన్నారు. వారు వేసిన పునాదులే అలా గుర్తుంచుకునేలా చేశాయని చెప్పారు. ఎంతసేపు రంగారెడ్డి జిల్లా గురించే ఆలోచిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లా గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు. మేం తెచ్చే ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. బుల్‌డోజర్లతో కూల్చేస్తున్నారని అంటున్నారని చెప్పారు. అవి చదువుకున్నవాళ్లు మాట్లాడే మాటలా అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును అడ్డుకునే వాళ్లు మూడు నెలలు అక్కడ నివసిస్తారా? అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కన్యాకుమారి లాగా బాపూఘాట్ కూడా రెండు నదుల సంగమం అని ఎంతమందికి తెలుసునని ప్రశ్నించారు. గోదావరి జలాల్లో 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టినట్లు తెలిపారు. గాంధీ విగ్రహానికి సుమారుగా రూ.75 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు అంబేద్కర్ విగ్రహానికి కోట్లు ఖర్చు చేస్తే తాము వ్యతిరేకించలేదని సీఎం రేవంత్ చెప్పారు.

# బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు

**అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు**

**జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి**

**గ్యాస్ కొరత పై జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి**

**సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దు**

**గృహ ,ఆసుపత్రులకు,విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ ,ఆశ్రమాలకు ప్రాధాన్యత**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ**

**కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాదమార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** మెరికా–ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్టా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు, విద్యాసంస్థలకు,వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్టిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు. తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్టిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు,సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి ,గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని,గృహ వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పేదల ఇళ్లు కూలిస్తే సహించబోం

(మొదటి పేజీ తరువాయి)

రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.. ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని.. కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా భారత ప్రజలు వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన వారని చెప్పారు. అలాంటి సమయంలో నాయకులు.. ప్రజల్లో ధైర్యం నింపాల్సిందే తప్ప, భయాందోళనలు కలిగించడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు. దేశంలో గృహ వినియోగ ఎల్పీజీ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాంచందర్ రావు తెలిపారు.

# తిరుమల లడ్డూపై పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీమార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** తిరుమల లడ్డూ వ్యవహారంలో దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఈ వ్యవహారంపై కామెంట్లు చేయకుండా నిలువరించాలని మానూరు శ్రీనివాస్ పిటిషన్ వేశారు. ఈ కామెంట్లపై సీబీఐ ఎలాంటి దర్యాప్తు జరపలేదని పేర్కొన్నారు. అయితే.. దర్యాప్తు పెండింగ్‌లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోలేమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేస్తూ పిటిషన్ కొట్టివేసింది. అన్ని అంశాలు పరిశీలించాకే సీబీఐతో సిట్ వేయించామని పేర్కొంది. ఏదైనా ఉంటే సీబీఐ ముందే చెప్పుకోవాలని సూచించింది.

# ఏపీలో రూ.47 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

**మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):**

ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ మాదకద్రవ్యాల తయారీపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) భారీ కొరడా ఝుళిపించింది. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి పారిశ్రామిక వాడలో ఎన్‌డీపీఎస్ చట్టం–1985 పరిధిలోకి వచ్చే సైకోట్రోపిక్ పదార్థమైన అల్ప్రజోలంను రహస్యంగా తయారు చేస్తున్న ఓ ఫ్యాక్టరీ గుట్టు రట్టు చేసింది. 'ఆపరేషన్ వైట్ హ్యామర్' అనే కోడ్‌నేమ్‌తో మార్చి 11, 12 తేదీల్లో నిర్వహించిన ఈ మెరుపు దాడుల్లో సుమారు రూ.47 కోట్ల విలువైన 237 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేసింది.

పక్కా ఇంటెలిజెన్స్ సమాచారంతో డీఆర్ఐ అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. రసాయనాల తయారీ యూనిట్ ముసుగులో పూర్తిస్థాయి పారిశ్రామిక వసతులతో అల్ప్రజోలం తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఫ్యాక్టరీ ప్రాంగణంలో జరిపిన సోదాల్లో రూ.47 కోట్ల విలువైన 237 కిలోల అల్ప్రజోలంతో పాటు, 800 కిలోలకు పైగా కీలక ముడి పదార్థాలు, 2,860 లీటర్ల వివిధ రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు రియాక్టర్లు, డ్రైయర్లు, సెంట్రిఫ్యూజ్ వంటి భారీ పారిశ్రామిక పరికరాలను సీజ్ చేసినట్లు డీఆర్ఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఇది వ్యవస్థీకృతంగా, పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమ తయారీ కేంద్రమని అధికారులు నిర్ధారించారు.ప్రాథమిక విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. రసాయన, ఫార్మా రంగంలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఓ కెమిస్ట్ ఈ అక్రమ దందాకు సూత్రధారిగా వ్యవహరించినట్లు తేలింది. అతడికి మరో వ్యక్తి సహకరిస్తూ హైదరాబాద్‌లో ముడి పదార్థాల సేకరణ, తయారైన డ్రగ్స్ పంపిణీ బాధ్యతలను చూసుకునేవాడు. వీరిద్దరూ అల్ప్రజోలం అక్రమ తయారీ కోసమే ఈ ఫ్యాక్టరీని అద్దెకు తీసుకున్నారని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు సూత్రధారులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా డీఆర్ఐ తన నిఘాను పటిష్ఠం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఎనిమిది రహస్య డ్రగ్ తయారీ కేంద్రాలను ఛేదించినట్లు అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల ముప్పు నుంచి సమాజాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని డీఆర్ఐ పునరుద్ఘాటించింది.

## కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ–ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. దీనికి ముందు, అస్సాంలో రెండ్రోజుల పర్యటన కోసం గౌహతి వచ్చిన మోదీకి రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు సాదర స్వాగతం పలికారు.

# నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 37 వేల మంది హాజరు కానున్నారు. నిజామాబాద్ జిల్లాలో 12,244 మంది బాలురు, 12,155 మంది బాలికలు హాజరు కానున్నారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్న 6,451 మంది బాలురు, 6,703 మంది బాలికలు కలిపి మొత్తం 13,154 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల విధానంలో ఈ సారి మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది వరకు వార్షిక పరీక్షలు ఆదివారాలు మినహా వరుసగా నిర్వహించేవారు. ఈసారి మాత్రం ఒక్కో పరీక్షకు మధ్య 3 నుంచి 5 రోజుల వరకు గడువు పెంచారు. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లిష్, 28న మ్యాథ్స్, ఏప్రిల్ 2న ఫిజిక్స్, 7న బయాలజీ, 13 సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగనున్నాయి. 15, 16 తేదీల్లో ఒకేషనల్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిమిత్తం 24 గంటల పాటు పని చేసేలా కంట్రోల్ నంబర్ (కామారెడ్డి–99596 70118, నిజామాబాద్–90302 82993) ఏర్పాటు చేశారు.పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు డిఇవో తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూస్తున్నాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని, పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలోనే ఉండేది. రెండేండ్లుగా పదో తరగతి ఫలితాల్లో వెనుకబడుతున్నది. గత రెండు సంవత్సరాల నుంచి కామారెడ్డి జిల్లా మరీ దారుణంగా వెనుకబడి పోతున్నది. ఈ నేపథ్యంలో ఉభయ జిల్లాల యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి.

## ఖాళీ సీట్ల కౌన్సెలింగ్‌కు అనుమతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిపోయాయని, ఈ సీట్లకు స్టే వెకెంట్ లేదా అదనపు రౌండ్ కౌన్సెలింగ్‌కు అనుమతి ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలు, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ), మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి ఆదేశాలు జారీ చేయాలని యాజమాన్యాల సంఘం కోరింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. పీజీ కౌన్సెలింగ్‌లో పాల్గొనే పర్సంటైల్ స్కోరు తగ్గింపు అంశం సుప్రీంకోర్టులో ఉన్నందున అక్కడ నిర్ణయం వెలువడే వరకు వేచిచూస్తామని పేర్కొంది. ఈ అంశంపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ, ఎన్ఎంసీ వివరణ సమర్పించాలని పేర్కొంటూ విచారణను 26కు వాయిదా వేసింది.

# ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

## గజ్వేల్ ఇఫ్తార్ విందులో హరీష్ రావు విమర్శలు

**గజ్వేల్,మార్చి 13 (జర్నలిస్ట్ వార్త్:)** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మదీనా మసీదులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి వారు ఇఫ్తార్ విందులో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ముస్లిం సోదరులకు రంజాన్ అత్యంత ప్రాముఖ్యమైన మాసం. ఆకలితో అలమటించే పేదవారి కడుపు బాధ ఎలా ఉంటుందో ఈ ఉపవాస దీక్షల ద్వారా ప్రతి ఒక్కరికి అర్థమవుతుందని' అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై స్పందిస్తూ.. 'గల్ఫ్ దేశాలలో యుద్ధ వాతావరణం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోతోంది. దీని వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. భవిష్యత్ లో పెట్రోల్ ధరలు పెరగడమే కాకుండా, గ్యాస్ సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గజ్వేల్ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధులు తిరిగి వెనక్కి తీసుకుంది. కొత్త నిధులు ఇవ్వాల్సింది పోయి, ఉన్న నిధులు లాక్కోవడం దారుణం. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ముస్లిం సోదరుల సంక్షేమం కోసం కట్టుబడ ఉంటామని' అన్నారు.

# మాదక ద్రవ్యాల నివారణపై యువతకు అవగాహన.

**-గార్ల బయ్యారం సీఐ రవీందర్.**



**బయ్యారం/మార్చి 13.(జర్నలిస్ట్ వార్త);** మాదక ద్రవ్యాలు,డ్రగ్స్ నిర్మూలనపై యువత అవగాహన కలిగి ఉండాలని గార్ల బయ్యారం సీఐ రవీందర్ అన్నారు.బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతిలో సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువత మాదక ద్రవ్యాల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్ మాట్లాడుతూ గంజాయి,డ్రగ్స్,మత్తు మందులు,గుట్కాలు ప్రమాదకరమన్నారు. యువతకు చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా,సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మంజూరు చెయ్యాలని ఎమ్మెల్యేకు వినతి.



**బయ్యారం/,మార్చి 13.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం కోయగూడెం గ్రామపంచాయతీ పరిధిలో చుంచుబంధం తండ నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డు మార్గం గుంతమయంగా మారిందని బీటి రోడ్డు మంజూరు చెయ్యాలని కోయగూడెం సర్పంచ్ లింగా నాయక్ ఆధ్వర్యంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కు కు వినతిపత్రం అందించారు.వాహనదారుల ఇబ్బందులను గుర్తించి రోడ్లు వేయించాలని సర్పంచ్ కోరారు.రోడ్డు సమస్యపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారనీ రోడ్డు మంజూరు చేపిస్తానని మాట ఇచ్చినట్లు సర్పంచ్ లింగా నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొంది రాజబాబు,పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**స్టేషన్ ఘన్పూర్/మార్చి13(జర్నలిస్ట్ వార్త):**
చిల్పూర్ మండలం వెంకటాద్రి పేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పరిపాల దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నార పాశాలలోని విద్యార్థులు ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులుగా తయారై చక్కగా పాఠాలు బోధిం చారు.స్వయం పరిపాల దినోత్సవ కార్యక్రమం ప్రధాన ఉపాధ్యాయులు ఎల్లయ్య అధ్యక్షతనలో ఏర్పాటు చేయడం జరిగింది కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికా రి గోవర్ధన్ గ్రామ సర్పంచ్ దేవి మంజుల ఉపస ర్పం చ్ ఉప సర్పంచ్ సుధాకర్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఎంఈఓ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నతస్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. వెంకటాద్రిపేట పాఠశా లో చెప్పిన పాఠాలు విద్యార్థులు శ్రద్దగా విని మంచి మార్కులు తెచ్చుకోవాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు, ప్రధానో పాధ్యాయులు ఎల్లయ్య మాట్లాడుతూ విద్యా ర్థులు చదువులలో ఆటలలో అన్ని రంగాలలో ముందుండాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాలఉపాధ్యాయులు వెంకటయ్య మంజుల, కాత్యాయని, స్వరూప, రేఖ, రోహిణి, తల్లిదండ్రు లు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణి



**తల్లాడ/మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు శ్రీమతి మట్ట రాగమయి దయానంద్ విజయకుమార్ ఆదేశాల మేరకు తల్లాడ మండలంలోని బిల్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆశ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మిట్టపల్లి సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, వారికి అవసరమైన విద్యా సామగ్రి అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు, పెన్నులను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బిల్లుపాడు సర్పంచ్ ఏనిక కృష్ణవేణి చేతుల మీదుగా అందజేశారు.విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జక్కంపూడి కిషోర్, రామ్ అప్పారావు, జక్కంపూడి రమేష్, ఏనిక నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు.

**-తహశీల్దార్ నాగరాజు.**





**బయ్యారం/మార్చి 13.(జర్నలిస్ట్ వార్త);** గ్యాస్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బయ్యారం మండల తహసీల్దార్ నాగరాజు అన్నారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశానుసారం శుక్రవారం బయ్యారం శ్రీ రాజరాజేశ్వరి హెచ్‌పీ గ్యాస్ గోదామును ఆయన సందర్శించారు.అక్కడ స్టాక్ నిల్వ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వినియో గదారులకు గ్యాస్ సరఫరా చేయాలన్నారు.అధిక ధరలకు గ్యాస్ విక్రయించి వినియోగదారులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.గ్యాస్ కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.తహశీల్దార్ వెంట ఆర్ఐ ఉపేందర్,జిపిఓ ప్రభాకర్ ఉన్నారు.

# తానేదార్ పల్లి పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ





**స్టేషన్ ఘన్పూర్/మార్చి 13 (జర్నలిస్ట్ వార్త)**
స్టేషన్ ఘనపూర్ మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల తానేధార్ పల్లిలో స్వయం పాలన దినో, త్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో హరి ప్రసాద్ మండల విద్యాధికారిగా, సాయి వర్షిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు గా, సింధుజ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గా,ఇంధుశ్రీ వ్యాయమ ఉపాధ్యాయురాలుగా, హర్షిక,సహస్ర,రూపాదేవి,శ్రీనాధ్,శివమిన్ను,సుశాంత్, శివరాము,దుర్గరాజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమతోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయు రాలు డి వినోద మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా బోధించారని కితాబు ఇచ్చారు.మంచిగా చదువుకొని,క్రమశిక్షణతో ఉంటూ జీవితంలో ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. న్యాయనిర్ణేతలుగా శ్రీలత,దేవెందర్ రెడ్డి, రాజు వ్యవహరించారు. అనంతరం బహుమతులు అందజేశారు.ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సంధ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

# 16న వేలేరు లో మెగా వైద్య శిబిరం




**వేలేరు/హనుమకొండ బ్యూరో, మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 16న వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించనున్న మెగా హెల్త్ క్యాంప్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డా. నవీన్ కుమార్ సూచించారు.శుక్రవారం వేలేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అప్పయ్య ఆదేశాల మేరకు ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఆరు విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొననున్నారని చెప్పారు. స్త్రీరోగ నిపుణులు, శిశు వైద్యులు, మోకాళ్లకు సంబంధించిన ఆర్థోపెడిక్ వైద్యులు, కంటి వైద్యులు, దంత వైద్యులు తదితర నిపుణులు ప్రజలకు సేవలు అందించనున్నారని వివరించారు.దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తమ ఆధార్ కార్డుతో వచ్చి పరీక్షలు చేయించుకుని తగిన చికిత్సతో పాటు మందులు తీసుకువెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను ఆశ్రయించడం వల్ల అధిక మోతాదులో మందులు వాడి ఆరోగ్య సమస్యలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అందువల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో అర్హత కలిగిన వైద్యుల వద్దనే చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు.ఈ నెల 16న రైతు వేదికలో నిర్వహించే మెగా హెల్త్ క్యాంప్‌కు వివిధ విభాగాలకు చెందిన నిపుణుల బృందం హాజరుకానున్నందున మండలంలోని గ్రామపంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామాల్లో దండోర కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌వీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీల ఏర్పాటు



**ఖమ్మం/ మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** జిల్లాలో బీసీ సమాజం రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ముందుకు దూసుకెళ్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కె.వి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో బీసీలు ఇంకా అణచివేతకు గురవుతున్నారని, ఇప్పటికైనా మేల్కొని అందరూ ఐక్యంగా రాజ్యాధికార దిశగా ప్రయాణించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో నిర్వహించిన సభలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేసి రాజ్యాంగంలోని తొమ్మిదవ పట్టికలో చేర్చి చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య మరియు ఉద్యోగ రంగాలలో బీసీ సమాజ అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. బీసీ కుటుంబాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మార్చి పదిహేనున నిర్వహించనున్న ఫీజు పోరు దీక్షను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు మారుతి ఆధ్వర్యంలో ఐదు మండలాల అధ్యక్షులను నియమించారు. కొండలరావును సత్తుపల్లి మండల అధ్యక్షుడిగా, మణికంఠను వేంసూరు మండల అధ్యక్షుడిగా, శీనును పెనుబల్లి మండల అధ్యక్షుడిగా, మురళిని కల్లూరు మండల అధ్యక్షుడిగా, శ్రీనివాసరావును తల్లాడ మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మోత్కూరు వెంకటేశ్వర చారి, నాగరాజు యాదవ్, పద్మాచారి, మక్కల వెంకన్న, రాసాల సతీష్ యాదవ్, చిన్నం శెట్టి వెంకట రామకృష్ణ, గునిగంటి వీరన్న, కుందారపు సుధాకర్, పుల్లూరు వెంకన్నబాబు, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించండి

## 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించిన బొజ్జ రాజు యాదవ్

**వేలేరు/హనుమకొండ బ్యూరో, మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):**పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా కష్టపడి చదివి ఇష్టంతో పరీక్షలు రాసి ఉన్నత ర్యాంకులు సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మల్లికార్జున ఫర్టిలైజర్ షాపు యాజమాని బొజ్జ రాజు యాదవ్ అన్నారు. గురువారం వేలేరు మండలంలోని మల్లికుదుర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోరంటల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జ రాజు యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశలను నెరవేర్చేలా క్రమశిక్షణతో చదవాలని సూచించారు. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.నేటి ఆధునిక సమాజంలో పోటీ తీవ్రంగా




పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు పట్టుదలతో చదివి పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేసి సమాజంలో ఆదర్శవంతమైన వ్యక్తులుగా నిలవాలని ఆకాంక్షించారు. అలాగే విద్యతోనే వ్యక్తి భవిష్యత్తు వెలుగొందుతుందని, అందుకే విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను




సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోరంటల రమేష్, సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ యాదవ్, ఉపాధ్యాయులు మేన శీను, విద్యానంద్, రషీద్, పీడీ రాజేశ్వరి, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు ఘనంగా

**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరో మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** ప్రముఖ తొలి తెలుగు కవయిత్రి మొల్ల586వ జయంతి సందర్భంగా ధర్మసాగర్ గ్రామంలో శాలివాహన గౌతమీపుత్ర యువసేన, శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణం ను సులభమైన తెలుగులో ప్రజలకు అందించి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన మహనీయ కవయిత్రిగా మొల్ల గారు ప్రత్యేక స్థానం సంపాదించారని కొనియాడారు.



ఈ సందర్భంగా డాక్టర్ వేదునూరి శేఖర్ మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించినప్పటికీ తన ప్రతిభతో మొల్ల గారు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఆమె రచనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత మొల్ల గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సాహిత్యంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే మరుపాక దేవేందర్ మాట్లాడుతూ మొల్ల గారు ప్రజలకు అర్థమయ్యే సులభమైన తెలుగులో రామాయణాన్ని రచించి సాహిత్య రంగానికి విశేష సేవలందించారని అన్నారు. ఇలాంటి మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం ద్వారా యువతకు చరిత్ర, సంస్కృతి, సాహిత్య వారసత్వం పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మద్రిపెల్లి రామయ్య, సాంబయ్య, సారయ్య, సుధాకర్, అంకుశు , రామచంద్రం, శంకరయ్య, రాజయ్య, యాదగిరి, లింగాలు, రమేష్, సదానందం, విజయ్, వేణు, సాంబరాజు, రాములు, వేదునూరి రాజయ్య, లింగమూర్తి, శేఖర్, అక్షయ్, మరుపాక దేవేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. యువకులుగా నిఖిల్, సాయి తేజ, సాత్విక్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం







**స్టేషన్ ఘన్పూర్/మార్చి 13 (జర్నలిస్ట్ వార్త) :**
ఘనంగా ప్రాథమిక పాఠశాల ఇందిరానగర్ లో స్వయం పాలన దినోత్సవం, పాఠశాల వార్షికోత్స వం. ఘనంగా నిర్వహించారు. గురువారం రోజన పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా తయారై చక్కగా పాటలు చక్కగా పాఠాలు బోధిం చడం జరిగినది. ప్రధానోపాధ్యా యులు కుమారి ఎం శ్రీకృతి. ఉపాధ్యాయులుగా జి అక్షిత్ కుమార్, కౌశిక్, ఎంఈఓ గా రుత్విక్ వ్యవహరిం చారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవ కార్యక్ర మం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిక్కుడు శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగిన ది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగ ఎంఈఓ జీ కొమురయ్య. స్కూల్ కాంప్లెక్స్ప్రధా నోపాధ్యాయులు సంపత్, రమేష్ హాజరైనారు ఎంఈఓ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించడంవల్ల విద్యార్థులసంఖ్య ను పెంచి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే కార్య క్రమాలు తల్లిదండ్రులకు తెలియడం వల్ల వారు వారి పిల్లలను పంపుతారని. గ్రామస్తులను పెద్దల ను పిల్లల తల్లిదండ్రులను మీ పిల్లలను ఇదే పాఠ శాలకు పంపించాలని కోరడం జరిగినది. కాంగ్రెస్ కాంప్లెక్స్ హెచ్ఎం సంపత్ సార్ మాట్లాడుతూ ఇది ఒక మంచి పాఠశాలగా ఉందని ప్రతి కార్యక్ర మం ఈ పాఠశాలలో అందిస్తున్నారని మంచి బోధన జరుగుతుందని ఇది ఒక మంచి కార్యక్ర మం అని ఉపాధ్యాయులను అభినందించారు. కాంప్లెక్స్ హెచ్ఎం రమేష్ మాట్లాడుతూ ఇంద్రా నగర్ పాఠశాల మంచి వాతావరణం లో కొనసా గుతుందని ప్రభుత్వం ప్రవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో మంచి ఉపాధ్యాయులు లను నియమిస్తుందని మీరందరూ వినియోగిం చుకోవాలని కోరారు. సమావేశంలో పిల్లలు చేసిన టువంటి నృత్యాలు. స్కిట్లు. వ్యక్తిగత నృత్యాలు గ్రామస్తులను. అతిథులను ఆనందపరిచేలా చేయడం జరిగింది. పాఠశాల హెచ్ఎం మాట్లాడు తూ మా దగ్గర ఉన్నటువంటి పిల్లలు అన్ని రంగా ల లో అభివృద్ధి చెందేలా బోధన చేస్తున్నామని ప్రతి ఒక్కరిపై వ్యక్తిగత శ్రద్ధ పెడుతున్నామని ప్రతి కార్యక్రమాన్ని చాలా ఘనంగా నిర్వహిస్తున్నామ ని మీరు కూడా పాఠశాలకు తగిన సూచనలు సలహాలు ఇస్తూ పాఠశాల అభివృద్ధిలో మీవంతు భాగస్వాములు కావాలని గ్రామస్తులు పిల్లల తల్లి దండ్రులను పెద్దలను కోరడం జరిగినది. అనంత రం డాన్సులల, పాటలలో,స్కిట్లలోప్రతిభ కనబరి చిన పిల్లలకు గాండ్ల రాజు బహుమతులు అందించడం జరిగింది. సమావేశంలో పాల్గొన్నటు వంటి వారికి జ్ఞాపికలు అందించడం జరిగినది. కార్యక్రమంలో ఎమ్మార్పీలు సిఆర్పిలు, అంగన్వా డీ టీచర్ సరోజ. ఆయా రజిత. పాఠశాల ఉపా ధ్యా యుడు రాజు. స్కావెంజర్ వెంకటలక్ష్మి. . గ్రామ పెద్దలు తోకల సమ్మయ్య. చెరిపెల్లి రామ్మ ల్లు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# గ్యాస్ కోసం బారుల తీరిన జనం

**తల్లాడ/ మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలో గ్యాస్ సిలిండర్ల కొరతతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లాడలోని కోట మైసమ్మ గ్యాస్ కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం నుంచే ప్రజలు బారులు తీశారు. ఉదయం ఏడు గంటలకే సిలిండర్లు తీసుకుని క్యూలో నిలబడినప్పటికీ ఉదయం పది గంటలు దాటినా సిబ్బంది ఎవరూ రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గ్యాస్ కోసం ముందుగానే నమోదు చేసుకుని ధృవీకరణ సంఖ్యలు వచ్చినప్పటికీ వారం రోజులు గడిచినా సిలిండర్లు అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ కేంద్రం నిర్వాహకులు సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గోదాము వద్దకు ఎవరూ రావద్దని ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది గ్యాస్ సిలిండర్లను రహస్యంగా అధిక ధరలకు విక్రయిస్తూ సాధారణ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు ఆరోపించారు. గ్యాస్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్యాస్ సరఫరాను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



# ప్రజాపాలన సన్నద్ధత దశ చివరి రోజు కార్యక్రమాలు





**నర్సంపేట/మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సన్నద్ధత దశలో చివరి రోజు కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ ఆధ్వర్యంలో కార్యాలయ దస్త్రాల క్రమబద్ధీకరణతో పాటు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. కార్యాలయానికి సంబంధించిన ఫైళ్లు, ముఖ్య పత్రాలు, పాత రికార్డులను గుర్తించి వాటిని వర్గీకరించి క్రమబద్ధంగా సర్దుబాటు చేశారు. పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను పరిశీలించి అవసరమైన వివరాలను నమోదు చేసి భద్రపరిచే చర్యలు చేపట్టారు. అలాగే కళాశాలకు సంబంధించిన కార్యాలయ మరియు విద్యా సంబంధిత దస్త్రాలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేసి సూచికల ప్రక్రియను ప్రారంభించారు. భవిష్యత్తులో సేవలను వేగవంతంగా అందించే లక్ష్యంతో రికార్డులను సంఖ్యా పద్ధతిలో నమోదు చేసి డిజిటల్ రూపంలో భద్రపరచే చర్యలను కూడా ప్రారంభించారు. ఇదే సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల చేత పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కార్యాలయ గదులు, ఫైళ్లు, రికార్డులు, ప్రయోగశాల పరికరాలు, ఫర్నిచర్ మరియు కళాశాల పరిసరాలను శుభ్రపరిచారు. కళాశాలలో పరిశుభ్రత, పచ్చదనం మరియు క్రమబద్ధమైన నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ మల్లం నవీన్ మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు. అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది సమిష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చిల్కూర్ దేవాలయాన్ని10 కోట్లతో అభివృద్ధి చేస్తా

**.... స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**.నూతనంగా 5వ సారి చైర్మన్ గా ప్రమాణం చేసిన పొట్లపల్లి శ్రీధర్ రావు**

**.ఘనంగా చిల్పూర్ దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం**



**స్టేషన్ ఘన్పూర్/మార్చి 13 (జర్నలిస్ట్ వార్త) :**
తెలంగాణలో రెండవ తిరుపతిగా పేరుగాంచిన చిల్పూర్ మండలంకేంద్రంలోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో గురువారం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావుతో పాటు పాలక మండలి సభ్యులు ప్రమా ణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహ రి హాజరై చైర్మన్ ను పాలకమండ సభ్యులను శాలువా తో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. పొట్లపల్లి శ్రీధర్ రావు చైర్మన్ కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపా రు.ఆ తర్వాత ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఆలయ పాలక వర్గంతో దేవాదాయ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాలక వర్గం ఆలయ పాలక వర్గం చైర్మన్ గా పొట్లపల్లి శ్రీధర్ రావు ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాపై నమ్మకంతో ఆలయ కమిటీ చైర్మన్ గా రెండవ సారి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పొట్లపల్లి శ్రీధర్ రావు భక్తి భావంతోనే కాకుండా సేవా భావంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలి పారు. శ్రీధర్ రావు స్వంత ఖర్చులతో ఆలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉమ్మడివరంగల్ జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లే అని అన్నారు. చిల్పూర్ ఆలయ అభివృద్ధికి 10కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొంది స్తున్నట్లు తెలిపారు. ఈ 10కోట్ల నిధులను ముఖ్యమం త్రి గారిని కలిసి రెండు నెలల్లో మంజూరు చేయిస్తానని తెలిపారు. ఏడాదిలో 10కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించను న్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఆలయానికి ఎదురుగా ఇండ్లు నిర్మించుకున్న వాటికీ వేరే చోట ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులు నాటి ఫెన్సింగ్ ఏర్పా టు చేసినట్లు వెల్లడించారు. గ్రామస్తులు సహకరిస్తేనే ఆలయ అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు.



ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పాలక వర్గ సభ్యులు గోలి రాజశేఖర్, పుల్యాల నారాయణరెడ్డి, డాక్టర్ వేముల వెంకటేశం, గనగోని రమేష్, కొండూరి రంగరాజు, దారం రా జన్ బాబు, గొల్లపెల్లి వాసు, బి కుమారస్వా మి , బత్తుల సూర్యనారాయణ, ఎడ్ల యాదయ్య, భూక్య శ్రీనివాస్ గూడేల్లి అరుణ రమేష్ రెడ్డి, ఎలగందుల రత్నాకర్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**పర్వతగిరి/మార్చి13 (జర్నలిస్ట్ వార్త);** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో 10వ తరగతి విద్యార్థినులకు (40 మందికి) అమెరికాలో ఉంటున్న దాత ముసుకు క్రాంతి కుమార్ సహకారంతో ఎగ్జామ్ రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని కోరుతూ'ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సలీమా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోగుల లావణ్య, వైస్ చైర్మన్ ఐలపాక స్వప్న, మాజీ వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, కమిటీ సభ్యులు జన్ను కుమారస్వామి, పసునూరు భాస్కర్, సింగారం గోపాల్, బిర్రు కరుణాకర్ , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మొండ్రాయి హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ




**సంగెం/మార్చి 13(జర్నలిస్ట్ వార్త):** మొండ్రాయి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సందర్భంగా రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గూడ స్వరూప-వీరస్వామి, ఉప సర్పంచ్ గూడ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనుముల కుమారస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. హెడ్ మాస్టర్ విజయ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి జిల్లా స్థాయిలో పాఠశాల పేరు నిలబెట్టాలని కోరుతూ ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐపిసి రాష్ట్ర నాయకులు గూడ రాజేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అనుముల కుమారస్వామి, వేల్పుల కుమారస్వామి, ఉపాధ్యాయ బృందం ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బతుకు పోరులో... తలవంచని ధైర్యం

## ఒత్తిడి కోరల్లో చిక్కుకున్న ఆధునిక జీవనం - ఆందోళన వదిలి అడుగు ముందుకు వేయాల్సిన సమయం.

నేటి యాంత్రిక జీవనంలో మనిషిని నీడలా వెంటాడుతున్న అతిపెద్ద శత్రువు ఒత్తిడి. ఉదయం నిద్రలేచింది మొదలు, రాత్రి పక్కపైకి చేరే వరకు ప్రతి అడుగులోనూ ఏదో ఒక టెన్షన్. ఉద్యోగ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక అంతరాలు... కారణం ఏదైనా కావచ్చు, సగటు మనిషి మెదడు ఒక అగ్నిపర్వతంలా మారుతోంది. టెంక్షన్ మత్ కరో అని పైకి చెప్పడం సులభమే కానీ, ఆచరణలో అది ఒక నిరంతర యుద్ధం.




**కనిపించని శత్రువు - పెను ముప్పు**

ఆందోళన అనేది కేవలం మానసిక సమస్య మాత్రమే కాదు, అది శారీరక ఆరోగ్యాన్ని కూడా

**దెబ్బతీసే మౌన విషం. అధిక రక్తపోటు,**

మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులకు ఈ మానసిక ఒత్తిడే ప్రధాన కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేపటి గురించి అతిగా ఆలోచిస్తూ, నేటి సంతోషాన్ని బలిపీఠం ఎక్కించడం ఎంతవరకు సమంజసం? గతాన్ని మార్చలేం, భవిష్యత్తును పూర్తిగా ఊహించలేం. మన చేతుల్లో ఉన్నది కేవలం వర్తమానం మాత్రమే.


**నిగ్రహమే ఆయుధం**

సమస్యలు లేని మనిషి ఉండడు, కానీ ఆ సమస్యలను చూసే దృక్పథంలోనే మార్పు రావాలి. ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోవడం, సవాళ్లు వస్తే పారిపోవడం పరిష్కారం కాదు. ప్రతి సంక్షోభం ఒక పాఠాన్ని నేర్పుతుంది.

సమయపాలన: పనులను వాయిదా వేయడం వల్ల కలిగే ఒత్తిడిని క్రమశిక్షణతో జయించాలి.

ఆత్మీయుల తోడు: మనసులోని భావాలను పంచుకోవడానికి కనీసం ఒక్కరైనా ఆత్మీయులు ఉండాలి. ఒంటరితనం ఒత్తిడికి ప్రధాన కేంద్రం.

శారీరక శ్రమ: యోగా, ధ్యానం లేదా కనీసం అరగంట నడక మెదడులో ఉత్సాహాన్ని నింపే హార్మోన్లను విడుదల చేస్తాయి.జీవితం అంటేనే ఎత్తుపల్లాలు. అలలు వస్తున్నాయని సముద్రం ప్రయాణాన్ని ఆపదు. అలాగే సమస్యలు వస్తున్నాయని మనిషి తన జీవన ఉత్సాహాన్ని చంపుకోకూడదు. ఆందోళన చెందడం వల్ల సమస్య పరిష్కారం కాదు సగటు సామర్థ్యం తగ్గిపోతుంది. ధైర్యంగా నిలబడి, ప్రశాంతమైన చిత్తంతో ఆలోచిస్తే చీకటిని చీల్చుకుని వచ్చే కాంతి రేఖ తప్పక కనిపిస్తుంది. ఆందోళనను వదిలేద్దాం.ఆనందంగా అడుగులేద్దాం



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103

# వేసవిలో ఆర్టీసీ ప్రయాణికులకు చల్లని కబురు

**సత్తుపల్లి/మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** వేసవి కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సత్తుపల్లి డిపో నుండి హైదరాబాద్‌కు ప్రత్యేక సౌకర్యాలతో బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గురజాల లక్ష్మణరావు తెలిపారు. సత్తుపల్లి నుండి హైదరాబాద్‌కు, అలాగే హైదరాబాద్ నుండి సత్తుపల్లికి ప్రతిరోజు ఆరు శీతలీకరణ బస్సులు, పదిహేడు సూపర్ లగ్జరీ బస్సులు నడుస్తున్నాయని వెల్లడించారు.ప్రయాణికుల సౌకర్యార్థం సత్తుపల్లి నుండి హైదరాబాద్‌కు ఉదయం 7.45, 9.15, 10.00 గంటలకు బీహెచ్ఈఎల్ వరకు శీతలీకరణ బస్సులు బయలుదేరుతాయని, రాత్రి 9.00, 9.45, 10.30 గంటలకు కూడా బస్సులు నడుస్తాయని తెలిపారు. బీహెచ్ఈఎల్ నుండి సత్తుపల్లికి ఉదయం 8.00, 9.00, 10.00 గంటలకు, రాత్రి 9.00, 10.00, 11.00 గంటలకు శీతలీకరణ బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

అదేవిధంగా సత్తుపల్లి నుండి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సులు ఉదయం 3.40 ఎంజీబీఎస్, 5.10 ఎంజీబీఎస్, 6.00 బీహెచ్ఈఎల్, 7.30 ఎంజీబీఎస్,




8.20 బీహెచ్ఈఎల్, 8.45 జీడిమెట్ల, 9.40 ఈసీఐఎల్, 10.45 ఎంజీబీఎస్ వరకు నడుస్తాయి. మధ్యాహ్నం 12.30, 2.00, 3.30 గంటలకు ఎంజీబీఎస్‌కు బస్సులు బయలుదేరుతాయి. సాయంత్రం 4.00 గంటలకు ఎంజీబీఎస్‌కు మరో బస్సు నడుస్తుంది. రాత్రి 9.00 ఈసీఐఎల్, 9.30 బీహెచ్ఈఎల్, 10.00 బీహెచ్ఈఎల్, 10.15 జీడిమెట్ల, 10.40 గచ్చిబౌలి, 11.15 లహరి స్లీపర్ వరకు సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంటాయి.హైదరాబాద్ నుండి సత్తుపల్లికి ఉదయం 4.40 ఎంజీబీఎస్, 5.50 ఎంజీబీఎస్, 6.20 బీహెచ్ఈఎల్, 7.00 ఎంజీబీఎస్, 7.00 బీహెచ్ఈఎల్, 7.15 జీడిమెట్ల, 9.00 ఈసీఐఎల్, 11.15 బీహెచ్ఈఎల్ నుండి బస్సులు బయలుదేరుతాయి. మధ్యాహ్నం 2.20 ఎంజీబీఎస్ నుండి, సాయంత్రం 4.15, 6.00 ఎంజీబీఎస్ నుండి బస్సులు ఉంటాయి. రాత్రి 8.40 గచ్చిబౌలి, 8.45 ఎంజీబీఎస్, 9.00 ఈసీఐఎల్, 9.20 జీడిమెట్ల, 9.20 లహరి స్లీపర్ బీహెచ్ఈఎల్, 9.40 బీహెచ్ఈఎల్ నుండి సత్తుపల్లికి బస్సులు నడుస్తాయని తెలిపారు.

అదే విధంగా సత్తుపల్లి నుండి తిరుపతికి మధ్యాహ్నం మూడు గంటలకు, తిరుపతి నుండి సత్తుపల్లికి కూడా మధ్యాహ్నం మూడు గంటలకు సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ కోరారు.

## సత్యనారాయణ స్వామి వ్రతానికి విచ్చేసిన నారా భువనేశ్వరి

**హైదరాబాద్/మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** జూబ్లీహిల్స్‌లోని తమ నివాసంలో తెలుగుదేశం పార్టీ యువనాయకుడు డాక్టర్ పొగాకు జైరాం చందర్ కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతానికి నారా భువనేశ్వరి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ స్వామివారికి పూజలు నిర్వహించగా, భక్తిపూర్వక



వాతావరణంలో వ్రతం ఘనంగా జరిగింది.వ్రతంలో పాల్గొన్న నారా భువనేశ్వరి గారు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జైరాం చందర్ కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ నివాసానికి విచ్చేసి ప్రేమతో, ఆప్యాయతతో ఆశీర్వదించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని జైరాం చందర్ కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా నారా భువనేశ్వరి గారికి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, ఆహ్వానితులు, అభిమానులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ వ్రతం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగి అందరికీ ఆహ్లాదాన్ని కలిగించింది.

# త్రివేణి పాఠశాల విద్యార్థుల అద్భుత విజయాలు

**సత్తుపల్లి,/ మార్చి 13 (జర్నలిస్ట్ వార్త):** స్థానిక గుడిపాడు రహదారిలో ఉన్న త్రివేణి పాఠశాల విద్యార్థులు వివిధ శాస్త్ర పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. విద్యార్థుల ఈ విజయాలు పాఠశాలకు గర్వకారణంగా నిలిచాయి. సూచిర్ ఇండియా సంస్థ నిర్వహించిన శాస్త్ర పోటీలు మరియు సివి రామన్ పేరుతో నిర్వహించిన పరీక్షల్లో త్రివేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి మంచి ఫలితాలు సాధించారు.అలాగే ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ నిర్వహించిన పరీక్షలో కూడా విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఏ. మిథున్ సాత్విక్ తండ్రి ఏ. వెంకటేశ్వరాలు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించగా, బి. నిఖిలేష్ తండ్రి బి. రవి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎం. సరిత విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తు మరింత ఉజ్జ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. క్యాంపస్



ఇన్‌చార్జ్ వంశీ, విద్యా విభాగం ఇన్‌చార్జ్ పవన్, చిన్నారుల విభాగం ఇన్‌చార్జ్ పద్మ కూడా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా సిఆర్ఓ మురళీకృష్ణ మరియు డైరెక్టర్ వీరేంద్ర చౌదరి విద్యార్థులను అభినందించారు. ఈ విజయాలకు ప్రధాన కారణమైన శాస్త్ర ఉపాధ్యాయుడు



ఎం. శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు షాలిని విద్యార్థులకు సరైన మార్గదర్శనం అందించి మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సహించారు. త్రివేణి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఈ విజయాలతో ఆనందం వ్యక్తం చేశారు.

## గురుకుల విద్యార్థులకు పరీక్షల సామాగ్రి పంపిణీ

### : దాత ముసుకు క్రాంతి కుమార్



**పర్వతగిరి/మార్చి 13(జర్నలిస్ట్ వార్త);**మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 10వ తరగతి వార్షిక పరీక్షలు రాయబోతున్న 75 మంది విద్యార్థినులకు ఎగ్జామ్ రైటింగ్ ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. అమెరికాలో నివసిస్తున్న ప్రముఖ దాత ముసుకు క్రాంతి కుమార్ విద్యార్థులపై ఉన్న మమకారంతో ఈ సామాగ్రిని విరాళంగా అందజేశారు. తాను దూరంగా ఉన్నప్పటికీ, విద్యార్థులందరికీ పరీక్షల్లో విజయం సాధించాలని ఆయన ఆల్ ది బెస్ట్ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పి. అపర్ణ, వైస్ ప్రిన్సిపల్స్ జోష్ణ, స్వాతి మరియు ఉపాధ్యాయ బృందం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోగుల లావణ్య, వైస్ చైర్మన్ ఐలపాక స్వప్న, మాజీ వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, కమిటీ సభ్యులు సింగారం గోపాల్, జన్ను కుమారస్వామి, పసునూరి భాస్కర్, బిర్రు కరుణాకర్, పాఠశాల సిబ్బంది హాజరయ్యారు.సొంత ఊరి పిల్లల చదువు కోసం ముందుకు వచ్చిన దాత క్రాంతి కుమార్‌ను పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీసీ ఆణిముత్యాలు పురస్కారాలు

### వర్ధన్నపేట బీసీ ఐక్యవేదిక భారీ ప్రకటన

**వర్ధన్నపేట/మార్చి13 (జర్నలిస్ట్ వార్త);**
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఉన్నత చదువుల దిశగా ప్రోత్సహించేందుకు వర్ధన్నపేట బీసీ ఐక్యవేదిక ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 10 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్బండ కులాలకు చెందిన విద్యార్థులకు బీసీ ఆణిముత్యాలు పేరుతో నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు ప్రకటించింది.సాధారణంగా కార్పొరేట్ పాఠశాలల్లోనే కనిపించే ఇటువంటి ప్రోత్సాహకాలను, ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించడం విశేషం.

**ప్రోత్సాహక బహుమతుల వివరాలు**

ప్రథమ బహుమతి: 10,000 నగదు మరియు షీల్డ్.
ద్వితీయ బహుమతి: 8,000 నగదు మరియు షీల్డ్.
3వ ర్యాంక్ నుండి 10వ ర్యాంక్ వరకు: ప్రతి విద్యార్థికి 5,000 నగదు పారితోషికం.

స్థానిక దాతలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సహకారంతో ఈ పురస్కారాలను అందజేయనున్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, 10/10 గ్రేడ్ సాధించి జిల్లా స్థాయిలో వర్ధన్నపేట పేరు నిలబెట్టాలని బీసీ ఐక్యవేదిక ఆకాంక్షిస్తూ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపింది.

# మూసీ ప్రక్షాళనకు ముందే పేదలను ఖాళీ చేయిస్తారా

### మూసీ పేరిట రేవంత్ లూటిఫికేషన్‌కు వ్యతిరేకం -సిఎం రేవంత్‌కు హరీష్ రావు ప్రశ్నలు

**హైదరాబాద్,మార్చి13 (జర్నలిస్ట్ వార్త);**
బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు మూసి బ్యూటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 8 సూటి ప్రశ్నలు సంధించారు. వీటికి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి మూసి బ్యూటిఫికేషన్‌పై ప్రెజంటేషన్ ఇస్తున్న సందర్భంగా మొదట తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, మూసీ పేరిట రేవంతు చేస్తున్న లూటిఫికేషన్ కు మాత్రమే వ్యతిరేకమని ,సుందరీకరణ పేరిట వేలాది మందిని నిరాశ్రయులుగా చేస్తుండటానికి వ్యతిరేకమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో మొదట మూసీ బ్యూటీఫికేషన్ కు శ్రీకారం చుట్టామని, రూ. 4వేల కోట్లతో 32 ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, గోదావరి నీళ్లను తెచ్చి మూసీలో పోసి శుద్ది చేయాలనీ ప్రణాళికలు వేశామని వెల్లడించారు. ఇవాళ రాష్ట్రంలో



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు చూస్తే తుగ్లన్ పాలన గుర్తుకు వస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి పథంలో నడిపిస్తే.. రేవంతు తన తుగ్లక్ పాలనతో అధోగతి పాలు చేస్తున్నడని దుయ్యబట్టారు. . ఒకసారి మూసీ సుందరీకరణ అంటడు, మరోసారి మూసీ ప్రక్షాళన అంటడు, ఇంకోసారి మూసీ పునరుజ్జీవం అంటడు. పూటకో పేరు మార్చుతూ, రోజుకో చోట ప్రజల ఇండ్లు కూల్చే హక్కు మీకు ఎవరు ఇచ్చారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన మీద చిత్తశుద్ది ఉన్న వారెవరు మొదలు మొదలే పేదల ఇండ్ల మీద పడరు . వికారాబాద్ నుంచి ఇక్కడి వరకు మురుగు నీటిని ఆపకుండా ప్రక్షాళన ఎలా చేస్తవు ? అంటూ నిలదీశారు. ఖజానా ఖాళీ అంటూనే, లక్షా 50వేల కోట్లకు టెండర్ పెట్టాడని విమర్శించారు. మూసీని బాగు చేయలనే చిత్తశుద్ధి ఉంటే మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోవాలని, ఫైవ్ స్టార్ హోటల్లలో, నీ జూబ్లీ హిల్స్ ప్యాలెస్ లో ఏసీల్లో కూర్చొని కాగితాలు తిరగేస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. ఎలాంటి డీపీఆర్ , ప్రణాళిక లేకుండా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలను కూల్చుతూ, భయభ్రాంతులకు గురి చేయడం దారుణమని అన్నారు.


# రైతుల కోసం అనేక కార్యక్రమాలు

### పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తరలింపు

### అన్నదాత సుఖీభవ కింద రైతు ఖాతాలో ఏటా 20వేలు జమ

### సూరంపల్లిలో అన్నదాత సుఖీభవను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

విజయవాడ,**మార్చి13 (జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్రంలోని రైతులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ. 6 వేలు ఇస్తున్నామన్నారు. రైతు ఖాతాలో ఏటా రూ.20 వేలు జమ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం రూ. 6 వేలు ఇస్తే.. మేం రూ.14 వేలు ఇస్తున్నామని చెప్పారు. శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సూరంపల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని.. రైతుల ఖాతాల్లోకి ఈ పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రైతులు సైతం టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నారన్నారు. రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు సమయానికి సాగునీరు ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రధాని మోదీ అసోంలో ఉండి దేశంలోని రైతులందరి ఖాతాల్లో నగదు వేశారని.. ఇది టెక్నాలజీకి ఉండే మహిమ అని వివరించారు. అదే




సమయంలో కేంద్రం ఇవ్వాల్సిన నగదు అక్కడ విడుదల చేస్తే.. మనం ఇక్కడ విడుదల చేశామని సీఎం చెప్పారు. అవన్నీ మీ ఖాతాల్లో ఇప్పుడు పరిశీలించుకునే పరిస్థితికి వచ్చిందంటే.. టెక్నాలజీ ఏ విధంగా పని చేస్తుందో మీరందరూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజు ఎన్నికల ముందు తాను, పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి మళ్ళీ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంతోపాటు రైతుల్ని పూర్తిగా ఆదుకుంటామని మాట ఇచ్చామని చెప్పారు. అందుకే సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఇంకొన్ని సంక్షేమ

కార్యక్రమాలు హామీ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ తర్వాత బీజేపీ కూడా కలిసి ఎన్డీఏ కూటమిగా ఏర్పాటయ్యామని సీఎం చంద్రబాబు వివరించారు. గడిచిన ప్రభుత్వం ఏ విధంగా దగా చేసిందనే విషయాలు కూడా మనం ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ?ఈ రోజు మూడో విడతలో 46,85000 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 6 వేలు డిపాజిట్ చేస్తున్నామని తెలిపారు. అటు కేంద్రం కానీ.. ఇటు రాష్ట్రం కానీ కలిపి మొత్తం రూ. 20 వేల అందిస్తున్నామన్నారు. ఈ విషయం రైతులందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తాను రైతు బిడ్డనని.. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. రైతు కుటుంబాలు ఇబ్బందుల్లో ఉండ కూదనే తన ఆలోచన, తపన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యవసాయానికి ప్రత్యేక బ్జడెట్ పెట్టించామని చెప్పారు. కృష్ణాజిల్లాలో నీళ్లు ఆలస్యంగా రావడం వల్ల తుఫాన్‌తో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఇవ్వడం ద్వారా పంటలను కాపాడామన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉందన్నారు. ఏపీ ఇమేజ్ దెబ్బ తిందని.. పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా నిలిచిపోయేలా చేశారన్నారు. ఇరవై నెలల్లో ఒక్కో సమస్యను పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. మీకు న్యాయం చేసిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని ధైర్యంగా చెబుతున్నానన్నారు. 47లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు వేశామని పేర్కొన్నారు. ÷-రకృతి విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని.. రూ. 300 కోట్లు నష్ట పరిహారం, రూ.500 కోట్ల ధరల స్థిరీకరణకు కేటాయించామని గణాంకాలతో సహా సీఎం చంద్రబాబు వివరించారు.

## హెచ్‌జె దొర మృతికి కెసిఆర్ సంతాపం

హైదరాబాద్,**మార్చి13 (జర్నలిస్ట్ వార్త);**
నాటి ఉమ్మడి రాష్ట్ర డీజీపీగా పని చేసిన మాజీ పోలీసు ఉన్నతాధికారి హెచ్ జె దొర మరణం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి , బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. పోలీస్ శాఖలో పలు హోదాల్లో బాధ్యతలను చేపట్టి, వినూత్న సంస్కరణలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం హెచ్ జె దొర



కృషి చేశారని కొనియాడారు.హెచ్‌జే దొర మరణం పట్లు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్ జే దొర నిమ్స్ లో చికిత్స పొందుతూ కన్ను మూశారు.÷రింత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధి తో బాధ పడుతూ దయాలసిస్ చేయించు కుంటున్నారు. ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడం తో నిమ్స్ ఏఆర్‌సీయూ చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన దొర ఉమ్మడి ఏపీలో మొదట అడిషనల్ డీజీపీగా అనంతరం డీజీపీగా పనిచేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దొర 1993లో పీపుల్స్‌వార్ గ్రూప్ లక్ష్యంగా చేసుకున్న 40 మంది కీలక పోలీసు అధికారుల జాబితాలో ఆయన పేరుకూడా ఉంది.

### ముగిసిన ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయన్న బోర్డు

హైదరాబాద్,**మార్చి13 (జర్నలిస్ట్ వార్త);** రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమైన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు పగడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి వెల్లడించారు. నిరంతర నిఘా, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిఘాను పటిష్టంగా అమలు చేయడం, పరీక్ష కేంద్రాల తనిఖీల వల్ల మాల్ ప్రాక్టీస్ కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. గత ఏడాది 2025లో రాష్ట్రవ్యాప్తంగా 115 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదవగా ఈ యేడాది 54 మాత్రమే కేసులు నమోదయ్యానట్లు వివరించారు. స్టేట్ అబ్జర్వర్లు, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు 10,426 కేంద్రాలను సందర్శించారని పేర్కొన్నారు. గత ఏడాది కంటే 1,876 కేంద్రాలను అధికంగా సందర్శించారని వివరించారు.